# వెళ్ళొస్తామండీ!

'ఒరేయ్! దూరపు చుట్టాలంటే ఎవ్వరా?' అడిగాడు ఒకాయన.

'ఎక్కడో దూరంగా... ఢిల్లీలో వుండే చుట్టాలన్నమాట'

'మరి దగ్గర చుట్టాలంటే...'

'ఎప్పుడూ మనింట్లోనే వుండేవాళ్ళన్నమాట'

'మరి చెడ్డ చుట్టాలంటే?'

'చుట్టాల్లో మంచి చుట్టాలూ, చెడ్డ చుట్టాలూ అంటూ వుండరు సార్. అందరూ మంచివాళ్ళే. కొందరు వుండి సంతోష పెడితే, కొందరు వెళ్ళి సంతోష పెడతారు. అంతే తేడా' అంటాడా బడుద్ధాయి.

అయ్యా ఇది నా స్వంత జోకు కాదు. సాక్షాత్తూ నవ్వొస్తే ముఖమాటం లేకుండా నవ్వుకునే వారి చుట్టం ముళ్ళపూడి వెంకటరమణగారిది. ఇహ ముఖమాట పడకుండా నవ్వండి.

మనింటికి ఎవరైనా వచ్చి, వెళ్ళిపోతున్నప్పుడు 'వెళ్ళొస్తామండీ!' అంటారు. నా చిన్నప్పుడు ఎక్కడో ఢిల్లీలో వున్న దూరపు చుట్టాలొచ్చినప్పుడు అనుకునేవాడిని, వీళ్ళు పాపం అంత దూరంనించీ వచ్చి, వెడుతూ మళ్ళీ వస్తామని అంటారెందుకు, అనవసరపు ఖర్చు కాదూ అని. అలాగే దగ్గర చుట్టాలు రెండు నెలలుండి వెడుతూ, వెళ్ళొస్తామంటే ఇదేమిటి మళ్ళీనా అనుకునేవాడిని. అప్పుడు మరీ చితకవాడిని కనుక. తర్వాత అర్థమైంది అలా అనటం మన సంస్కృతిలో భాగమని.

ఎందుకు అది మన సంస్కృతిలో భాగమయింది?

ఎందుకంటే, వెడతామండీ అంటే అలాగే పైకి వెడతారని. పోతారని. అందుకనే అనకూడదు. అపచారం. వెళ్ళొస్తామంటే... 'అదే పోత పోవటం లేదు ఇంకా వుంటున్నాం. వుంటున్నాం కనుక, మళ్ళీ వస్తాం' అని. అలా అది నమ్మేవాళ్ళు నమ్మితే, అదో మూఢ నమ్మకం అని ఆ నమ్మకాన్ని నమ్మనివాళ్ళు నమ్ముతారు. ఏది ఏమైనా వెళ్ళొస్తామండీ అనటం మనం రోజూ వినటమే కాదు, మనం కూడా ఎవరింటికైనా వెడితే అలా అంటూనే వుంటాం కదా.

అలాగే పాతికేళ్ళ క్రితం 'వెళ్ళొస్తాం' అని చెప్పి మేమూ అమెరికా వచ్చాం. మధ్యమధ్య ఇండియాకి వెళ్ళినా, ఇంకా ఇండియాకి 'వెళ్ళ' లేదు. మేమేకాదు మనకి తెలిసిన గణాంకాలని బట్టి అమెరికాకి వచ్చేవారిలో నూటికి తొంభై తొమ్మిది శాతం పైన ఇండియాకి తిరిగివెళ్ళటం లేదు. వచ్చిన ఫల్గుణులు ఎందుకు తిరిగి వెళ్ళటం లేదులాటి విషయాలు 'అంతులేని కథ' అనే కబుర్లలో చెప్పుకున్నాం. కాకపోతే ఈమధ్య పరిస్థితి కొంచెం మారుతున్నది. ఎంత మారుతున్నది. ఎందుకు మారుతున్నది. ఎలా మారుతున్నది అని చూడటమే ఈ వ్యాసం ఉద్దేశ్యం.

0 0 0

ఈ విషయాన్ని కొంచెం నిశితంగా పరిశీలించాలంటే మనం మొదలు

పెట్టాల్సింది, తిరిగి వెళ్ళకపోవటానికి ఇంతకు ముందు ఎంతోమంది, ఇప్పుడు చాలమంది చెబుతున్న కారణాలేమిటో చూడటం. దాని తర్వాత వాటిలో ఎంత మార్పు వచ్చిందో చూడటం. ఆ మార్పు ఎందుకు వచ్చిందో చూడటం. దానివల్ల పరిస్థితి ఎలా మారుతున్నదో చూడటం.

'చేపా చేపా ఎందుకు ఎండలేదు' అంటే 'ఎండ' లేదు అందిట.

సుజాతగారూ, ఎందుకు వెళ్ళలేదు అంటే 'వెళ్ళ' లేదు అనే అంటారు.

అయినా సాధారణంగా వినిపించే కారణాలు చూద్దాం. మొట్టమొదటి కారణం మా పిల్లలు అక్కడ వుండలేరు అని. తర్వాత చాల వున్నాయి. ఆ దుమ్మూ ధూళీ భరించలేం బాబూ. ఎలెక్ట్రిసిటీ వుండదు. నీళ్ళుండవు. ఆ ట్రాఫిక్‌లో బ్రతక గలమా. గవర్నమెంటూ, రాజకీయ నాయకులూ, లంచాలూ, వయలెన్సూ మోసాలూ వుండలేం సార్. అక్కడి వాళ్ళందరూ ఇక్కడికి రావటానికి తంటాలు పడుతుంటే, హాయిగా వున్నవాళ్ళం అక్కడికెందుకు వెళ్ళటం. అక్కడ ఏం చేయాలన్నా అవకాశాలు తక్కువ. గవర్నమెంట్ ఉద్యోగుల లంచాలు మనల్ని ఏపనీ చేయనీయవు. కొంతమంది చెప్పే కారణాలు మనస్ఫూర్తిగా చెప్పేవయితే, కొన్ని తిరిగి వెళ్ళక పోవటానికి చెప్పే వంకలు. అలా వంకలు చెప్పేవాళ్ళు ఎలానూ వెళ్ళరు. కొంతమంది నిజాయితీగా, మేమిక్కడే వుందామని వచ్చాం వుంటున్నాం. ఇండియా వెళ్ళాలనిపించినప్పుడల్లా వెడుతుంటాం. చూడాల్సిన వాళ్ళని చూసి తిరిగి వస్తుంటాం అనేవాళ్ళని ఈ పరిశీలనలోకి తీసుకోవటం లేదు.

మరి ఈ కారణాల్లో ఎంత మార్పు వచ్చింది. 1980 మొదటి భాగం లోనూ, అంతకు ముందూ ఇక్కడికొచ్చిన వాళ్ళల్లో చాలమందికి పిల్లలు పెరిగి, పెళ్ళిళ్ళు చేసుకుని సంసారాల్లో మునిగిపోయారు. తల్లిదండ్రులకి దూరంగా వేరే రాష్ట్రాలకి వెళ్ళిపోతున్నారు. కనుక పిల్లలు ఇక అడ్డం కాదు. అప్పటిదాకా పరుగుల జీవితంలో అలిసిపోయిన కొంతమంది తల్లిదండ్రులు రిటైరయి ప్రశాంతంగా గడుపు దామనే ఆలోచనలో పడుతున్నారు. కాస్తో కూస్తో డబ్బులు వెనకేసిన వాళ్ళు అమెరికా లోనే వుండిపోయే అవకాశం వుంది. మిగతావాళ్ళు ఉద్యోగంలో వున్నప్పటి కన్నా ఆదాయం తక్కువయిపోవటంవల్ల, జీవన విధానంలో మార్పులు చేసుకోవాల్సి వస్తు న్నది. నెలకి రెండు వేల డాలర్లు వచ్చినా, ఇండియాలో నెలకి 90 వేల రూపాయలు అవుతుంది. హాయిగా బ్రతకటానికి ఆ డబ్బు ధారాళంగా సరిపోతుంది. మాకు తెలిసిన వారిలో కొందరు విశాఖపట్నంలాటి వూళ్ళల్లో సెటిల్ అయిపోతున్నారు. సంవత్సరానికో రెండేళ్ళకో ఒకసారి అమెరికాకి చుట్టంచూపుగా వచ్చిపోతున్నారు.

ఇంకొక కారణం, ప్రపంచీకరణవల్ల ఇండియాలో ఉద్యోగాలూ జీతాలు పెరిగిపోయాయి. అమెరికాలో అనుభవం, అమెరికాలోని కంపెనీలలో పరిచయాలున్న వారి అవసరమూ పెరిగింది. అందుకని కొన్ని కంపెనీలు ఎక్కువ జీతమిచ్చి వారిని ఇండియాకి రప్పిస్తున్నాయి. ఇండియాకి తిరిగి వెళ్ళే భావన మనసులో వున్నవారికి అదొక తాంబూలం. వదులుకోలేని తాయిలం. అలాగే ఎన్నో అమెరికన్ కంపెనీలు బెంగుళూర్‌లాటి నగరాల్లో బ్రాంచీలు ప్రారంభిస్తున్నాయి. అమెరికాలో సీనియర్

మేనేజర్లుగా వున్న భారతీయుల్ని, ఇండియాలో బ్రాంచ్ ఆఫీసులు నడపటానికీ, మేనేజ్ చేయటానికి భారీ జీతాలు ఇచ్చి పంపిస్తున్నాయి. అలాటివారికి అదొక పెద్ద అవకాశం. ఈ మధ్య ఆస్టిన్‌నించే కొంతమంది అలా బెంగుళూర్ వెళ్ళారు. ఒకటి రెండు సంవత్సరాలక్కడ వుండి, అంతా సవ్యంగా వుంటే వుండిపోదామని వుద్దేశ్యం.

నాస్కాం సాఫ్ట్‌వేర్ ట్రేడింగ్ గ్రూప్ గణాంకాల ప్రకారం సెప్టెంబర్ 2001 నించీ మార్చి 2005 దాకా 30 వేల భారతీయ ఐ.టి. ఉద్యోగులు ఇండియాకి తిరిగి వచ్చారుట. వారిలో పెద్ద శాతం బెంగుళూరుకి వెళ్ళారని చెబుతున్నాయి ఆ లెఖ్ఖలు.

అంతమంది ఎందుకు ఒక్కసారిగా వెనక్కి వెళ్ళారు అన్నదానికి సమాధానం వుంది. అమెరికాలో ఆర్థిక పరిస్థితి బాగా లేకపోవటం వల్ల చాలమందిని ఉద్యోగాల్లో నించీ తీసేయటం, దానికి బదులు ఇండియాలాటి దేశాలకి ఔట్‌సోర్సింగ్ చేసి ఉద్యోగాలు అక్కడికి పంపించటం, ఆ ఉద్యోగాలతోపాటు అవకాశాలూ పెరగగానే అమెరికాకి వచ్చిన వలసవీరులు తిరిగి 'వెళ్ళ'టం, దానితో బెంగుళూర్ ఇండియాలో హైటెక్ రాజధాని అవటం చకచకా జరిగిపోయాయి.

మరి దుమ్మూ ధూళీ? ఈమధ్య బాగానే శుభ్రం చేస్తున్నారు సార్. ట్రాఫిక్కూ అంతే. రోడ్లు పెద్దవి చేస్తున్నారు. ఇండియాలో ఏదన్నా వ్యాపారం చేసుకోవటానికి, రాజకీయ నాయకుల ప్రభుత్వోద్యోగుల లంచాలు అడ్డం కానీ, హైటెక్కు ఉద్యోగాలు చేసుకోటానికీ, ప్రశాంతంగా ఒక చిన్న వూళ్ళో బ్రతకటానికీ కష్టమేమీ కాదు. అంతా మన మంచికే!

ఈమధ్య రెండేళ్ళ కొలువు మీద బెంగుళూర్ వెళ్ళిన కొందరు చెప్పిన దాన్నిబట్టి, అక్కడ ఎన్నో కాలనీలు తయారయాయనీ, అక్కడ పెద్దవారికి ప్రశాంతం గానూ, పిల్లలకి చాలవరకూ అమెరికాలో అలవాటు పడిన జీవన విధానానికి సరిపడే టట్టుగా స్కూళ్ళూ, స్విమ్మింగ్ పూళ్ళూ మొదలైన వాటితోనూ, పనిచేయని ఆడ వారికి కావలసినన్ని మాళ్ళూ షాపింగ్ సెంటర్‌లతోనూ పూర్తిగా మారిపోయిందనీ, ఇక మళ్ళీ అమెరికా వెళ్ళే పనిలేదనీ కూడా అంటున్నారు. కాకపోతే అక్కడ పామ్ మెడోస్ అనీ, ఇలాటివే మిగతా అమెరికన్ పేర్లతో కట్టిన కాలనీలలో ఒక్కొక్క ఇల్లు 270 వేల డాలర్లకి అమ్ముతున్నారుట. అవి అమెరికాలోని చాల ఇళ్ళ విలువ కన్నా ఎక్కువ. డాలర్‌కి 45 రూపాయల చొప్పున వాటి ఖరీదెంతో మీరే లెఖ్ఖ కట్టుకోండి.

ఇండియాలో వుండిపోదామా వద్దా అనే నిర్ణయం తీసుకోవటం కోసం ఇండియా వెళ్ళిన ఒక పెద్ద మనిషి, అక్కడి నించీ తిరిగి వచ్చి అన్నమాటలివి.

'నేను ముప్ఫై ఏళ్ళ క్రితం ఇండియా వదిలినప్పటికీ ఇప్పటికీ విపరీతమైన మార్పు వచ్చింది. అందుకే తిరిగి వెడదామని అనుకుంటున్నాం' అన్నాడు. తర్వాత రెండు నెలలకి ఇండియాకి వెళ్ళిపోయారు.

వెళ్ళబోయేముందు, వెడుతూ వాళ్ళావిడ 'వెళ్ళొస్తామండీ' అంది.

శ్రీమతి నవ్వుతూ 'మళ్ళీ రాకండి. అక్కడే హాయిగా వుండండి' అని మనస్ఫూర్తిగా దీవించింది.

0 0 0